ప్రజాశక్తి

సోమవారం 23 సెప్టెంబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

భారీగా అధికారుల బదిలీ

- కీలక శాఖలలో ఊపందుకున్న ప్రక్రియ
- ఒకేరోజు 10 మంది జిల్లా అధికారులకు స్థానచలనం
- ముగిసిన బదిలీల జాతర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన 100 రోజులకు వివిధ శాఖల జిల్లా అధికారుల బదిలీలు ప్రారంభం అయ్యాయి. ఈ మేరకు ఆదివారం వివిధ శాఖల అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ పల్నాడు జిల్లా అధికారి జి.జోసఫ్ కుమార్‌ను ప్రకాశం జిల్లా డ్వామా పీడీగా బదిలీ అయ్యారు. గుంటూరు జిల్లా డ్వామా పీడీగా కల్యాణ్‌దుర్గంలో డిఎల్‌డివోగా ఉన్న వి.శంకర్‌ను నియమించారు. పల్నాడు జిల్లాలో అసిస్టెంట్ పీడీగా ఉన్న ఆకుల సుధాకర్‌ను పంచాయతీరాజ్ శాఖ పరిపాలన విభాగానికి బదిలీ చేశారు. కర్నూలు డ్వామా శాఖలో పనిచేస్తున్న ఎం.సిద్ధలింగమూర్తిని పల్నాడు జిల్లా డ్వామా అధికారిగా బదిలీ చేశారు. పంచాయతీరాజ్ శాఖలో గుంటూరు ఈఈగా ఉన్న జి.అశోక్‌ను బాపట్ల జిల్లా ఈఈగా బదిలీ చేశారు.

తెనాలి ఈఈ జెడ్ రమేష్‌ను విజయవాడకు, ఒంగోలులో ఉన్న జె.హరేరామకృష్ణను గుంటూరుకు, బాపట్లలో ఉన్న జి.ముత్యం బాబును తెనాలికి బదిలీ చేశారు. గ్రామీణ నీటిపారుదల శాఖ ఎస్ఈ ఆర్.సురేష్‌ను అనంతపురం జిల్లా ఎస్‌గా బదిలీ చేశారు. గుంటూరుకు ఇంకా ఎవరినీ నియమించలేదు. గుంటూరు జిల్లా పంచాయతీ అధికారిగా మార్కాపురం డివిజనల్ అభివృద్ధి అధికారి బి.వి.నాగశాయికుమార్‌ను నియమించారు. ఇప్పటి వరకు ఉన్న కె.శ్రీదేవిని బదిలీ చేశారు. వాణిజ్య పన్నుల శాఖ గుంటూరులోని ఇద్దరు జాయింట్ కమిషనర్‌లు కె.మధుబాబు, డి.నాగజ్యోతిని రాష్ట్ర కార్యాలయానికి బదిలీ చేశారు. వారి స్థానంలో గుంటూరు-1 జాయింట్ కమిషనర్‌గా ఏలూరులో పనిచేస్తున్న డి.శ్రీలక్ష్మిని, గుంటూరు-2 జాయింట్ కమిషనర్‌గా రాష్ట్ర కార్యాలయం నుంచి బి.గీతా మాధురిని నియమించారు. మైనింగ్‌శాఖలో కూడా బదిలీలు జరిగాయి. పుటపర్తిలో ఉన్న మైనింగ్ అధికారి వై.నాగయ్య ను పల్నాడు జిల్లా మైనింగ్, జియాలజీ అధికారిగా బదిలీ చేశారు. పలమనేరులోని పి.ప్రకాష్‌కుమార్‌ను దాచేపల్లి డివిజనల్ అధికారిగా నియమించారు. పరిశ్రమల శాఖలో కడప జిల్లా అధికారి జయలక్ష్మిని గుంటూరుకు బదిలీ చేశారు. ఇంకా దేవాదాయశాఖలో పనిచేస్తున్న డిప్యూటీ, అసిసెంట్ కమిషనర్లను కూడా ప్రభుత్వం ఆదివారం రాత్రి బదిలీ చేసింది. పెదకాకాని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి.శ్రీరామ వరప్రసాద్‌ను కృష్ణాజిల్లా చల్లపల్లి ఆలయానికి బదిలీ చేశారు. విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న జివిడిఎన్ లీలాకుమార్‌ను పెదకాకానికి బదిలీ చేశారు.

2018 నుంచి ఇప్పటి వరకు ▶ 2లో

ఆస్పత్రి ఎదుట బైటాయించిన మృతురాలి బంధువులు.. ఇన్‌సెట్‌లో మృతురాలు జ్యోతి (ఫైల్)

రూ.లక్షలు పెట్టి వైద్యం.. దక్కని ప్రాణం..

నరసరావుపేటలో ఆస్పత్రి ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్యాస్టిక్ సమస్యతో వైద్యం కోసం వచ్చిన మహిళ మృతి చెందగా ఆగ్రహానికి గురైన ఆమె కుటుంబీకులు, బంధువులు కలిసి ఆస్పత్రిలో ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి ఆందోళనకు దిగారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో అంజిరెడ్డి హాస్పిటల్‌లో వద్ద ఆదివారం ఘటన జరిగిన నేపథ్యంలో ఆస్పత్రి ఎదుటే బాధితులు బైఠాయించారు. మృతురాలి జ్యోతి (33) భర్త గూడూరి రోశిబాబు వివరాల ప్రకారం.. జ్యోతికి ఇటీవల గ్యాస్టిక్ సమస్య రావడంతో అంజిరెడ్డి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఆపరేషన్ చేయాలని చెప్పిన వైద్యులు ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేస్తామని ఆపరేషన్ పూర్తి చేశారు. అయితే అదనంగా రూ.1.20 లక్షల వరకు వసూలు చేశారని మృతురాలి భర్త చెబుతున్నారు. ఆపరేషన్ అనంతరం 10 రోజులకు మళ్లీ జ్యోతి మళ్లీ అస్వస్థతకు గురి కావడంతో గత శుక్రవారం రాత్రి అదే హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. అయితే ఈసారి ఆరోగ్యశ్రీ వర్తించదంటూ ఆదివారం వరకు రూ.80 వేలు వసూలు చేశారని, తీరా ఆదివారం పరిస్థితి విషమించి మృతి చెందినట్లు చెప్పి రూ.50 వేలు చెల్లించి మృతదేహాన్ని తీసుకెళ్లాలన్నారని రోశిబాబు తెలిపారు. దీంతో ఆగ్రహించిన మృతురాలి బంధువులు హాస్పిటల్ ఎదుట బైటాయించారు. మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ▶ 2లో

మాట్లాడుతున్న దయా రమాదేవి

వేతనమివ్వకుంటే వంట ఎలా?

మధ్యాహ్న భోజన కార్మికులకు వేధింపులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుంటూరు

మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి డిమాండ్ చేశారు. ఆదివారం పాతగుంటూరు సిఐటియు జిల్లా కార్యాలయంలో జ్ఞానకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమాదేవి మాట్లాడారు. వేతనాలు నెలలు తరబడి విడుదల చేయకపోతే వంట ఏ విధంగా చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వచ్చే బిల్లులు కూడా అరకొరా వేస్తూ, ఎంత జమ చేస్తున్నారో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. పెరుగుతున్న ధరల వల్ల ప్రభుత్వం ఇచ్చే మెనూ ఛార్జీలు సరిపోవట్లేదని చెప్పారు. ధరలు అదుపు చేయలేని ప్రభుత్వం కనీసం వండడానికి కావాల్సిన ఆహార పదార్థాలు అందించకపోవడం విచారకరమని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం లక్ష్యాన్ని దెబ్బతీసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వానికి మధ్యాహ్న భోజనం పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పెండింగ్ వేతనాలను బిల్లులను చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు ఛార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గ్యాస్ ప్రభుత్వమే ▶ 2లో

సభలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారధి, వేదికపై వివిధ పార్టీలు, సంఘాల నాయకులు.. హాజరైన జనం (ఇన్‌సెట్)

ఇటీవల మరణించిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రం చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. వామపక్షాలతోపాటు, ఇతర రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు హాజరై సీతారం ఏచూరితో ఉన్న అనుబంధాన్ని, అనుభవాలను రాజకీయాల్లో ఆయన ప్రాధాన్యతను గుర్తు చేసుకున్నారు.

వార్త మెయిన్‌లో

రాష్ట్ర స్థాయి క్రీడల్లో విద్యుత్ ఉద్యోగి విజయం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : నెల్లూరు జిల్లా దర్గామెట్ట నెల్లూరు క్లబ్‌లో ఈనెల 19, 20, 21 తేదీల్లో జరిగిన విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి పోటీల్లో తెనాలి చినరావూరుకు చెందిన ఎపిసిపిడిసిఎల్ ఉద్యోగి కొమరవల్లి మహేష్ విజేతగా నిలిచారు. 19 సర్కిల్స్ నుంచి వచ్చిన విద్యుత్ ఉద్యోగుల టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ది అఫీషియల్ క్లబ్ తెనాలి నుంచి పాల్గొన్న మహేష్ టెన్నిస్ సింగిల్స్, డౌబుల్స్‌లో విజేతగా నిలిచారని టెన్నిస్ క్రీడాకారులు, తెనాలి మూడవ పట్టణ సిఐ రమేష్ కుమార్ తెలిపారు. క్రీడలు ద్వారా తెనాలి ప్రతిష్టను ఇనుమడింపజేసిన మహేష్‌ను విద్యుత్ అధికారులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

రేషన్ ద్వారా నిత్యాసరాలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-సత్తెనపల్లి : అన్ని రకాల నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వారా తక్కువ ధరలకు సరఫరా చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం ఆఫీస్ ఏరియా శాఖ మహాసభ స్థానిక పుతుంబాక భవన్‌లో ఆదివారం జరిగింది. ఇటీవల మరణించిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. అనంతరం జరిగిన మహాసభలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు, రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య మాట్లాడారు. పట్టణంలో ప్రతిరోజు చెత్త సేకరణ, మురుగు కాల్వల శుభ్రం చేయాలని, గడియార స్తంభం సెంటర్ నుండి బస్టాండ్ వరకు రోడ్డును మరమ్మతు చేపట్టాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అన్ని రకాల పథకాలను అమలు చేయాలని, ఇంటి పనున్నును ఐదేళ్లకోసారే పెంచాలని, అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానాలను మహాసభ ఆమోదించింది. అనంతరం శాఖ కార్యదర్శిగా ఎం.జ్యోతిని తిరిగి ఎన్నుకున్నారు. టి.లక్ష్మీప్రసన్న, ఎం.వెంకటేశ్వరరావు, ఐ.అరుణ, టి.సదానందరావు, జి.నాగలక్ష్మి, జి.ఈశ్వర్ ప్రదీప్, కె.నాగేశ్వరరావు, సిహెచ్. ఆంజనేయులు, జె.స్పందన, పి.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

రాజధానిలో అసైన్డ్ రైతులకు న్యాయం చేయండి

రాజధాని ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షులు మాదల శ్రీనివాసు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని గ్రామాల్లో భూ సమీకరణలో భూములిచ్చిన అసైన్డ్ రైతులకు కూడా న్యాయం చేయాలని అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షులు మాదల శ్రీనివాసు కోరారు. గుంటూరులోని ఒక సమావేశ మందిరంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ న్యాయపరమైన చిక్కుల నుండి రైతులకు ఉపశమనం కలిగించాలన్నారు. రాజధాని గ్రామాల్లో తాగునీటి, భూగర్భ డ్రెయినేజీ నిర్మాణాలపై శాశ్వత పరిష్కారం దిశగా పనిచేయాలని సూచించారు. అమరావతి జీవధార కొండవీటి వాగు పునరుజ్జీవ ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా అమరావతి పరిసర ప్రాంతాలకు తాగు, సాగు నీటి అవసరాలు తీర్చాలన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టులో అమరావతి రాజధానిపై కేసులు విత్ డ్రా చేసుకోవాలన్నారు. అమరావతి రాజధాని విషయంపై కోర్టులో పిటీషన్‌లపై అనుకూలంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు గత ప్రభుత్వం నీడల నుంచి మారకుంటే అమరావతి అభివృద్ధి కుంటుపడుతుందని, ముఖ్యంగా రెవెన్యూ అధికారుల తీరు మారాలని అన్నారు. మౌలిక సదుపాయాలు ఇతర అంశాల కల్పనపై నిర్దిష్ట కాల పరిమితిని ప్రకటించాలని కోరారు. అమరావతిలో సిఆర్‌డిఎ భవనాన్ని నిర్మించాలన్నారు. అమరావతి ఉద్యమంలో సహకరించిన వారికి నవంబర్లో ప్రత్యేకంగా సన్మానం చేయాలని జెఎసి నిర్ణయించిందన్నారు. ల్యాండ్ పూలింగ్‌లో రైతులు ప్రభుత్వానికి స్వాధీనం చేసిన భూముల్లో అక్రమణలు, నిర్మాణాలు తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు కళ్లం రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎసైన్డ్ భూములపై సిట్ విచారణ పేరుతో కౌలు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. జీవో ఎంఎస్ 41పై ముఖ్యమంత్రి అసెంబ్లీలో తీర్మానం చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. సిఆర్‌డిఎ నియమాలను అనుగుణంగా డైనమిక్ ప్లాట్స్ కేటాయించాలని, భూములు ఆక్రమించిన వారిపై, నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజధాని రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి డి.రామారావు మాట్లాడుతూ గతంలో భూములు ఇవ్వని రైతులు ప్రస్తుతం ముందుకు వస్తున్నారని, వారి సందేహాలు నివత్తి చేయాలని కోరారు. కొంతమంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం వేసిన కౌలు జమ కాలేదని తెలిపారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లో రైతులకున్న సమస్యలన పరిష్కరించాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం జాయింట్ కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.

కాలుదువ్విన తెలంగాణ ఎడ్లు

- **జూనియర్స్ విభాగంలో విజేతగా హైదరాబాద్ జత**
- **కొనసాగుతున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎండ్ల పందేలు**

బండను లాగుతున్న ఎదులు.. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో జరుగుతున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పందేలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం జూనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించగా తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుకు చెందిన రోహన్ బాబు ఎడ్లజత 2523.3 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి కైవసం చేసుకున్నాయి. గుంటూరు సోమిసెట్టి ఆంజనేయులు, ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం బురుజుపల్లికి చెందిన యరమల మోక్ష అదరన్‌రెడ్డి కంబైన్డ్ జత 2481.4 అడుగుల దూరం లాగి ద్వితీయ సాథనంలో నిలిచాయి. హైదరాబాద్‌కు చెందిన రోహన్ బాబు ఎడ్ల జత 2408.1 అడుగులు, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరీష చౌదరి శివకృష్ణ చౌదరి ఎడ్ల జతలు 2408.1 అడుగులతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. అత్తోట శిరీష చౌదరి శివకృష్ణ చౌదరి ఎడ్ల జత 2400 అడుగుల దూరంతో నాలుగో స్థానం, కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నాదెళ్లవారిపాలేనికి చెందిన కాకర్ల సురేష్‌బాబు ఎడ్ల జతలు 2100 అడుగుల దూరంతో ఐదో స్థానం, గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం నాగులపాడుకు చెందిన ఆళ్ల మోహనరావు, గొల్లపూడి కోటయ చౌదరి కంబైన్డ్ ఎడ్ల జతలు1894.6 అడుగులతో ఆరో స్థానం, పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాలకు చెందిన పిన్నెబోయిన సూర్య అవిసిక యాదవ్ ఎడ్ల జతలు 1505.6 అడుగుల దూరంతో ఏడో స్థానం సాధించాయి. విజేతలకు టిడిజి జిల్లా అధ్యక్షులు, తాడికొండ ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. టిడిపి మండల కన్వీనర్ జి.శివరాం ప్రసాద్, ఉపాధ్యక్షులు కె.పెంటరెడ్డి, కె.సుబ్బారెడ్డి, రాష్ట్ర రైతు మీడియా కో-ఆర్డినేటర్ జి.వెంకటేశ్వరరావు, భాగ్యరావు, తిక్కిరెడ్డిపాలెం సర్పంచ్ మాకినేని జగన్ పాల్గొన్నారు.

రైల్వే అనుమతి రద్దు చేసినా నిర్మాణాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి : గుంటూరులో వైసిపి నాయకులు అంబటి మురళీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్‌కు రైల్వేశాఖ గతేడాదే అనుమతులు రద్దు చేసిందని పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదిత్య ఇన్‌ఫ్రా అపార్టుమెంట్స్ ఎన్‌ఒసిని రైల్వేశాఖ రద్దు చేసిన విషయాన్ని దాచిపెట్టి కార్పొరేషన్ అధికారులు నిర్మాణాలను కొనసాగించడానికి సహకరించారని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించటం వలనే రైల్వే వారు ఎన్‌ఒసిని రద్దు చేశారని పేర్కొన్నారు. కార్పొరేషన్ అధికారులు అనుమతి లేకుండా నిర్మాణాలు చేయకూడదని తెలిసినా కొనసాగిస్తున్నారని, భజరంగ్ అర్బన్ ఇన్ఫ్రా సంస్థతో కుమ్మక్కైన కార్పొరేషన్ అధికారులు ఎవరు? కార్పొరేషన్ వారికి రైల్వే శాఖ వారు పంపిన ఎన్‌ఒసి రద్దు కాపీని మాయం చేసి వారికి సహకరించిన వారు ఎవరో తేల్చాలని డిమాండ్ చేశారు. ఒకరి పేరున ప్లాన్ తీసుకుని మరొకరు నిర్మాణం ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఆన్లైన్లో తప్పుడు ధ్రువపత్రాలు దాఖలు చేసి మీ పేరు మీద అక్రమ బదిలీ చేశారని గుర్తు చేశారు. కార్పొరేషన్ అధికారులు విడుదల చేసిన గ్రౌండ్ ఇన్‌స్పెక్షన్ రిపోర్టులో కూడా రైల్వే శాఖ ఎన్‌ఒసి రద్దు గురించి తెలపలేదని పేర్కొన్నారు.

నాటకం, భాషను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి : మంచి చెడులను ఎంచి చెప్పేది కళలని, మానసిక ఉల్లాసాన్ని కలిగించేవి కళలని ప్రముఖులు చెప్పారు. స్థానిక పోలేరమ్మ గుడి వద్ద ఘంటసాల కళాపరిషత్ 19వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు బుడగాల సుబ్బారావు అధ్యక్షత వహించారు. అతిథులు మాట్లాడుతూ టీవీలు, సెల్‌ఫోన్ల ప్రభావంతో నాటక రంగం దెబ్బతింతని, పుస్తకాలు చదవడమూ తగ్గిందని, తెలుగు భాష కనుమరుగైపోతోందని ఆవేదన వెలిబుచ్చారు. విద్యావంతులు సైతం తెలుగును సరిగా రాయలేకపోతున్నారని అన్నారు. తెలుగు భాషతోపాటు నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేటికీ అనేక కళాపరిషత్‌లు వ్యయ ప్రయాసలకోర్చి కళా పరిషత్తులు నిర్వహించడం అభినందనీయమని మెచ్చుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, తెలుగు పండితులు మంచికంటి

వెంకటేశ్వరరావు, పారిశ్రామికవేత్త పోతుంటి రామకోటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ కొల్లిపర కాశీ విశ్వనాథం, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సయ్యద్ పెద్ద కరిముల్లా, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, కళ్లం వీరభాస్కర్‌రెడ్డి, వైసిపి నాయకులు మర్రి వెంకటరామిరెడ్డి మాట్లాడారు. బి.బాలరాజు 'మ్యూజికల్ నైట్' ఘంటసాల గీతలాపన చేశారు. ఎం.మధు రచన, దర్శకత్వంలో తుళ్లూరు కళాపరిషత్తు వారి 'మౌనం', త్యాగం సాంఘిక నాటికలు, ఉషోదయ కళాపరిషత్ వారి స్థానిక కళాకారులచే 'హాస్యవల్లరి', బెజగం రవికుమార్ బృందం 'శ్రీకృష్ణ రాయబారం'పడక సీను ప్రదర్శించారు.

మహిళ మృతిపై విచారణ

ప్రజాశక్తి తెనాలి : ఆనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన కేసులో తహసిల్దార్ కె వి గోపాలకృష్ణ విచారణ చేపట్టారు. మృతదేహం గుంటూరు జిల్లా వైద్యశాలలో ఉన్న నేపథ్యంలో ఆయన మహిళ మరణానికి చెందిన కారణాలపై కుటుంబ సభ్యులను విచారణ చేశారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. కొల్లిపర మండలం సిరిపురానికి చెందిన ఎ.వసంతలక్ష్మికి (33) నాజర్‌పేటకు చెందిన కరీంపృథ్వీతో వివాహమైంది. గతనెల 28న వసంత లక్ష్మి ఓ బాబుకు జన్మనిచ్చింది. ఈ నేపథ్యంలో ఈనెల 16న బాత్రూంలో కాలుజారిపడి వసంత లక్ష్మి అస్వస్థతకు గురైందంటూ కొల్లూరులో ఉన్న ఆమె అక్క మరియమ్మకు కరీం పృథ్వీ సమాచారం ఇచ్చాడు. తొలుత తెనాలిలో ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అనంతరం గుంటూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ వసంతలక్ష్మి శనివారం అర్ధరాత్రి మృథి చెందారు. ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ మరియమ్మ పట్టణ ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసుల కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ గుంటూరు జిజిహెచ్‌లో ఉన్న వసంత లక్ష్మి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. వివాహమైన ఏడేళ్లలోపు జరిగిన మృతిపై మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ శవ పంచనామా నిర్వహించాల్సిన బాధ్యత ఉందని, మృతురాలికి వివాహమై ఏడాదిలోగా మృతి చెందిన నేపథ్యంలో పంచనామా నిర్వహించామని, నివేదికను సంబంధిత అధికారులు పంపుతామని తహశీల్దార్ చెప్పారు.

రూ.87 వేలు పలికిన లడ్డు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి గణేష్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా మట్టి వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండవల్లికి చెందిన గాదె వినయకుమార్ రూ.87 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. మణిమాలను కె.జతీష్ రూ.60 వేలకు చేజిక్కించుకున్నారు. ఈ సందర్భంగా కోలాటం ప్రదర్శించిన కోలాటం పలువురిని ఆలోచింపజేసింది.

వేతనమివ్వకుంటే వంట ఎలా?

(మొదటి పేజీ తరువాయి)

సరఫరా చేయాలని, రాగి జావ బదులు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే ఏదో ఒకటి ఇవ్వాలని కోరారు. అనంతరం యూనియన్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా జ్ఞానకుమారి, షమీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కళ్యాణి, కోశాధికారిగా దేవకుమారి, సహాయ కార్యదర్శులుగా వరలక్ష్మి, సుమతి, ఉపాధ్యక్షులుగా రేణుక 15 మందితో కమిటీ ఎన్నుకున్నారు.

భారీగా అధికారుల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

రెండు ప్రభుత్వాల హయాంలో పనిచేసిన జిల్లా అధికారులు ఇప్పటికీ ఆయా శాఖలో కొనసాగుతున్నారు. 5ఏళ్ల తరబడి ఒకే శాఖలో పనిచేస్తున్న జిల్లా అధికారులకు కూడా ఇంకా బదిలీ ఉత్తర్వులు రాలేదు. అయితే నూతన ప్రభుత్వంలో కొత్తగా ఆయా శాఖలకు మంత్రులు, ఉన్నతాధికారులు రావడం వల్ల త్వరలో అన్ని శాఖల జిల్లా అధికారులకు బదిలీ తప్పదనే వాదన విన్పిస్తోంది. మునిసిపల్ శాఖలో మాత్రం కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మునిసిపల్ మేనేజర్ల పోస్టులకు రాష్ట్ర స్థాయిలోనే బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే గత నెల రోజులుగా జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగుల బదిలీ ప్రక్రియ ఆదివారంతో ముగిసింది.

సోమవారం నుంచి బదిలీలపై నిషేధం అమలులోకి వస్తుంది. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రజా ప్రతినిదుల సిఫార్సుల మేరకు ఎక్కువగా జరిగాయి. ఉద్యోగులే తాము కోరుకున్న చోటకు వెళ్లడానికి, అదే స్థానంలో కొనసాగడానికి ప్రజా ప్రతినిధులను ఆశ్రయించారు. కొంత మంది కొన్ని సాంకేతిక కారణాలు చూపి బదిలీ నుంచి తప్పించుకున్నారు. ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు సోమవారం విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహశీల్దార్లు, ఆర్‌ఐలు, వివిధ హోదాల్లోని ఉద్యోగుల బదిలీపై కలెక్టర్ ఉత్తర్వులు ఇంకా వెలువడ లేదు. పంచాయతీరాజ్ రాజ్‌లో కూడా బదిలీపై ప్రతిష్టంభన నెలకొంది.

రూ.లక్షలు పెట్టి వైద్యం.. దక్కని ప్రాణం..

(మొదటి పేజీ తరువాయి)

హాస్పిటల్ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతురాలి బంధువులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా... న్యాయం చేసేదాక ఆందోళన విరమించేంది లేదని వారు పట్టుబట్టి ఆందోళన కొనసాగిస్తున్నారు. మృతురాలికి ముగ్గురు పిల్లలున్నారు.

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలి : సిఐటియు

ఆందోళన వద్దకు సిఐటియు పట్టణ అధ్యక్షులు సిలార్ మసూద్ చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుడు గూడూరి రోశిబాబు భార్య జ్యోతి మృతికి హాస్పిటల్ యాజమాన్యం బాధ్యత తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశార. మృతురాలికి ముగ్గురు పిల్లలున్నారని, వారి సంరక్షణ బాధ్యతను ఆస్పత్రి తీసుకోవాలని అన్నారు. న్యాయం చేసేవరకూ బాధితులకు తాము అండగా ఉంటామన్నారు. పూర్తిస్థాయి వైద్యులు లేకుండా సూపర్‌స్పెషాలిటీ, మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ నడుపుతున్న యాజమాన్యంపై వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సామాజిక ధిక్కార కవి జాషువా

డాక్టర్ గరికపాటి గురజాడ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సామాజిక అధికార కవి జాషువా అని కేంద్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ గరికపాటి గురజాడ పేర్కొన్నారు. మహాకవి గుర్రం జాషువా 129వ జయంతి వారోత్సవాల్లో భాగంగా మహాకవి జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని అన్నమయ్య కళా వేదికలో జాషువా పద్యానికి పట్టాభిషేకం అంశం పై సభ జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ అధ్యక్షత వహించారు. తొలుత సభాసదులు డాక్టర్ గరికపాటి గురజాడని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ గరికపాటి గురజాడ మాట్లాడుతూ జాషువా పద్యాల్లో నవ రసాలు ఉంటాయని ప్రశంసించారు. మహాకవి గుర్రం జాషువా సున్నితమైన మనస్కుడని అదే ఆయన గొప్ప లక్షణమని తెలిపారు. గుర్రం జాషువా ప్రపంచంలో ప్రతి వస్తువులో భగవంతుడిని చూశాడని తెలిపారు. ఆయన తన కన్న తల్లిని గురించి గొప్పగా కవిత్వీకరించాలని వివరించారు. కన్నతల్లిని ప్రేమించగలిగినవాడే సమాజాన్ని ప్రేమిస్తాడని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది గడ్డం ఎలీషా, కవి నాటక ప్రయోక్త దేవరపల్లి ప్రభుదాస్, పినపాటి మోహన్రావు అత్తోట జోసెఫ్, సాహితీ పరిశోధకులు పారా అశోక్, చిట్టిపోతు మస్తానయ్య, జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోనోవిజన్ యాజమాన్యం పై కేసు

ప్రజాశక్తి - మంగళగిరి

మాట్లాడుతున్న న్యాయవాది తారక్ ప్రసాద్

సోనోవిజన్ యాజమాన్యంపై రెస్టారెంట్ స్థలాన్ని అక్రమంగా కబ్జాచేసి గోడలు పగులగొట్టించిన కేసు నమోదు చేసినట్లు హైకోర్టు న్యాయవాది తారక ప్రసాద్ తెలిపారు. ఆదివారం మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళగిరికి చెందిన ఖలీల్ భయ్యా ఫ్యామిలీ రెస్టారెంట్ ఓనర్ ఖలీల్ భయ్యా, రెస్టారెంట్ మేనేజర్ మచ్చా శ్రీనివాసరావును సోనోవిజన్ యాజమాన్యం పుట్లూరు భాస్కరమూర్తి వారి అనుచరులు దౌర్జన్యం చేశారని తెలిపారు. ఖలీల్ భయ్యాకు చెందిన స్థలాన్ని అక్రమంగా కబ్జా చేసి గోడలు పగలగొట్టి వారి మేనేజర్‌ను, వారి భార్యను కొట్టి చంపడానికి ప్రయత్నించినారన్నారు. కబ్జా వ్యవహారం పై మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ లో సోనోవిజన్ యాజమాన్యం పై కేసు నమోదు చేసినట్లు అడ్వకేట్ డి తారక ప్రసాద్ తెలియజేశారు.

పోరాటాల గొంతుక సీతారం ఏచూరి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంటూరు

ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ మాజీ అఖిల భారత అధ్యక్షులుగా పనిచేసిన సీతారాం ఏచూరి మృతికి ఎస్ఎఫ్ఐ నాయకులు నివాళి అర్పించారు. స్థానిక బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ 1974లో సీతారాం ఏచూరి ఎస్ఎఫ్ఐలో చేరారని ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా మూడుసార్లు గెలుపొందాడన్నారు. యూనివర్సిటీ సమస్యల మీద మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఇంటి వద్ద ధర్నా చేసి, జేఎన్‌యుకు ఛాన్సలర్‌గా ఉన్న ఇందిరా గాంధీచేత రాజీనామా చేయించారన్నారు. చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు నినాదంతో ఎమర్జెన్సీని సైతం ఎదిరించి పోరాడిన సైనికుడు అని గుర్తు చేశారు.విద్యార్థి నాయకుడి నుండి సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎదిగి, దేశంలో పీడిత వర్గాల సమస్యల పరిష్కారానికి కడవరకూ నిలిచారని, ఆయన మరణం ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. ఏచూరి స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యాప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్.కె.సమీర్, ఉపాధ్యక్షులు సుచరిత, సహాయ కార్యదర్శులు పవన్, యశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు అభి, షరీఫ్, జగదీష్, ఆరిఫా, ప్రతాప్, అజయ్ పాల్గొన్నారు

ప్రజాశక్తి-తాడేపల్లి : దేశం గర్వించదగిన బహుముఖ ప్రజ్ఞాశాలి సీతారాం ఏచూరి అని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. ఆదివారం తాడేపల్లి వచ్చిన ఆయన సిపిఎం నాయకులతో కలిసి ఏచూరి చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, డివి భాస్కరరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, బి.గోపిరెడ్డి, డి.దశరథరామిరెడ్డి, డి.యోహాన్, ఎం.సుబ్బారావు, జి.సుబ్బారావు, వై.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - తెనాలి

సమావేశంలో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని కాంక్షించి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక బోస్ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ప్రభుత్వం నిర్దేశించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం పై ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయ్యిందని, ఇప్పటివరకు చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం గంజాయి విక్రయాలను తీవ్రంగా ప్రోత్సహించిందని, దానిని 80శాతం వరకు నియంత్రించామన్నారు. ప్రభుత్వ వైద్యశాలలలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో బియ్యం అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఇటీవల కురిసిన భారీ వర్షం, వరదలతో ముంపుకు గురైన ప్రాంతాలలో పర్యటించి, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో బాధితులకు సహాయక చర్యలు చేపట్టామన్నారు. పంట నష్టపోయిన రైతాంగానికి పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. రాబోయే కాలంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు మరింత పారదర్శకంగా అమలు చేస్తామన్నారు. సమావేశంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బి రవి కాంత్, జిల్లా పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఇస్మాయిల్ భేగ్, నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి మురళీకృష్ణ, చక్రయాపాలెం ఎంపిటిసి అమ్మిశెట్టి హరిక్రిష్ణ, దివ్వెల మధుబాబు, హరిదాసు గౌరీ శంకర్, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, దంతాల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ప్రపంచ శాంతికి కృషి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : ప్రపంచంలో గతంలో అత్యధిక మరణాలు మత విద్వాషాలతోనే జరిగాయని మతసామరస్యాన్ని పెంపొందించడం ద్వారానే ప్రపంచంలో శాంతిని పెంపొందించగలమని జన చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక జనచైతన్య వేదిక హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ శాంతి యొక్క ఆవశ్యకతను ప్రతి ఒక్కరు గుర్తించాలని, శాంతి, సంస్కృతిని పెంపొందించడానికి కృషి చేయాలని అన్నారు. మతం అంటే అభిప్రాయమని, భిన్నమతాలు భిన్న అభిప్రాయాలకు సంకేతమని ఆధ్యాత్మికవేత్త పి.చలపతి రావు అన్నారు. ప్రజలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ సామరస్యంగా జీవించాలని హితవు పలికారు. కార్యక్రమంలో బ్రదర్ రాజన్న, ఇస్లామీ ధార్మిక ప్రసంగీకులు మిర్జా గఫ్ఫార్ బేగ్, హుస్నాబి, మానవత చైర్మన్ పావులూరి రమేష్, ప్రెసిడెంట్ కొమ్మాలపాటి శ్రీనివాసరావు, సెక్రటరీ కె.సతీష్ తదితరులు ప్రసంగించారు.

ఎస్సీ వర్గీకరణ అమలు మాదిగల విజయం

ఆత్మీయ సమ్మేళనంలో మంద కృష్ణమాదిగ

ప్రజాశక్తి-తెనాలి

మూడు దశాబ్దాల పాటు నిర్విరామంగా పోరాడి విజయం సాధించిన ఏకైక సామాజిక ఉద్యమం ఎస్సీ వర్గీకరణ ఉద్యమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పిఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ మాదిగల చిరకాల స్వప్నమని, ఆ ఉద్యమంలో ఎందరో అమరులయ్యారని, ఈ విజయం వారికే అంకితమన్నారు. ఎమ్మార్పిఎస్, దాని అనుబంధ సంఘాలు, బాబుజగజ్జీవన్‌రామ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం రాత్రి నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమావేశంలో కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కృష్ణ మాదిగ రాకను స్వాగతించేందుకు వివిఎస్సార్ కళాశాల నుంచి సభావేదిక వరకూ అభిమానుల భారీ ర్యాలీ నిర్వహించారు. సీనియర్ ఎపిపి సుద్దపల్లి సుకుమార్, హైకోర్టు న్యాయవాది మేకల రవికుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో చంద్రబాబునాయుడు సిఎంగా కేంద్రంలో ఎన్డీఏ అధికారంలో ఉన్నపుడు వర్గీకరణ అమలైందన్నారు. కాని 2004లో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సాంకేతిక కారణాలను చూపి సుప్రీంకోర్టులో అడ్డుకోవటంతో ఎస్సీ వర్గీకరణ అమలు నిలిచిపోయిందన్నారు. తిరిగి మరలా నిరంతరంగా సాగించిన పోరాట ఫలితంగా ఇప్పుడు కూడా రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండటం, కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ అధికారంలో ఉండటం సానుకూల సంకేతాలుగా చెప్పారు. ఎట్టకేలకు ఆగష్టు 11న సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిందన్నారు. ఇంతటితో సంబరపడటం కాదని, దీనిని అమలు చేయించినపుడే వర్గీకరణ ఫలాలు అందుతాయన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో వర్గీకరణ అమలు జాప్యం జరుగుతుందన్నారు. వర్గీకరణను వ్యతిరేకించే పార్టీల్లో మాదిగ ఎమ్మెల్యేలు, ఎంపిలు ఎందుకు పనిచేయాలని ప్రశ్నించారు. త్వరలోనే మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపిలను కలుస్తామని, తదుపరి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిసి వర్గీకరణ అమలుపై చర్చిస్తామన్నారు. ఏపి జిఎస్టీ కమిషనర్, ఐఆర్ఎస్ అధికారి పి.ఆనందకుమార్ మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 6శాతం మంది మాదిగలున్నారన్నారు. ఎపి ఇన్‌కంట్యాక్స్ ప్రిన్సిపల్ మిషనర్ బి.కోటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో రిజర్వేషన్ ఫలాలు అనుభవించాలంటే ఖచ్చితంగా చదువుండాలని, ఆదిశగా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు మాదిగ, రాష్ట్ర అద్యక్షులు రుద్రపోగు సురేష్‌మాదిగ, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టీనా, కత్తెర సురేష్‌కుమార్, ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ శ్రీనివాసరావు, ఎఎన్‌యూ బాబుజగజ్జీవన్‌రామ్ చైర్ కన్వీనర్ డాక్టర్ పి.జోసఫ్ రత్నాకర్, మహిళా విభాగం నాయకులు ఆలపాటి కరుణ ప్రసంగించారు. ఈ సందర్భంగా కృష్ణమాదిగను ఘనంగా సత్కరించారు.

అభివాదం చేస్తున్న మంద కృష్ణ మాదిగ, ఇతర నాయకులు

భవన నిర్మాణ మేస్త్రీని నమ్మించి మోసం

దశలవారీగా రూ.10వేలు వసూలు- సైబర్ కేసు నమోదు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మేస్త్రీగా పనిచేస్తున్న వ్యక్తికి పని కల్పిస్తానని నమ్మబలికి అతని ఎకౌంట్ నుండి దశలవారీగా సొమ్ము వసూలు చేసిన సంఘటన చిలకలూరిపేటలో శనివారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న మేస్త్రీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆదివారం విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో ప్రముఖ సిమెంట్ వ్యాపారికి శుక్రవారం అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి తాను ప్రభుత్వ హాస్పిటల్లో పని చేస్తున్నానని, తనపేరు డాక్టర్ ప్రసాద్ అని చెప్పాడు. ఆసుపత్రిలో పనిచేయించడానికి ఎవ్వరైనా మంచి తాపీమెస్త్రీ ఉంటే నెంబర్ చెప్పండి అని అడిగాడు. ఈక్రమంలో వ్యాపారికి తెలిసిన భవన నిర్మాణ రంగ మేస్త్రీ సుభాని నంబరు ఇచ్చాడు. సుభానికి డాక్టర్ ప్రసాద్ అని చెప్పుకున్న వ్యక్తి ఫోన్‌చేసి ఆసుపత్రిలో పని ఉందని శనివారం సాయంత్రం రమ్మని చెప్పాడు. కొద్దిసేపటి తరువాత అతనే ఫోన్ చేసి ప్రస్తుతం తాను పెట్రోల్ బంకులో ఉన్నానని, పెట్రోలుకొట్టించానని, తన ఎటిఎం కార్డు పనిచేయడం లేదని రూ.10వేలు తన ఎకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయమని చెప్పాడు. సాయంత్రం కలిసినపుడు ఎమౌంట్ ఇస్తానని నమ్మబలకడంతో సుభాని రూ.10వేలు అతని ఎకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. శనివారం సాయంత్రం ఆసుపత్రికి వెళ్లి విచారించగా అక్కడ డాక్టర్ ప్రసాద్ అనే వ్యక్తి లేడని తేలడంతో అతను ఫోన్ చేసిన నంబరుకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. దీంతో తాను మోసపోయానని గమనించి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సైబర్ కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో ఘర్షణ - ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మద్యం మత్తులో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఒకరి పై మరోకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దర గాయపడ్డారు. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం గర్నెపూడి లో శనివారం రాత్రి జరిగింది. దాడిలో ఇరువర్గాలకు చెందిన పేరుపోగు శివ పొంగులూరి నాగరాజు గాయపడ్డారు. బాధితులు సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ :రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద శనివారం అర్ధరాత్రి జరిగింది. మృతుడుకి రెండు కాళ్లు విరిగిపోయాయి. రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు (55), ఆకుపచ్చ రంగు చొక్క, గళ్ళ లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుని వద్ద గుంటూరు నుండి సత్తెనపల్లి వచ్చినట్లు గా టికెట్ లభ్యమైందని చెప్పారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 7993507979 కాల్ చేయాలని రైల్వే పోలీసులు విజ్ఞప్తి చేశారు.

డిఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న బిఎస్‌పి నాయకులు

ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు పై డీఎస్పీకి ఫిర్యాదు

ప్రజాశక్తి - తెనాలి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘు రామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బిఎస్పీ, మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న రఘురామ కృష్ణంరాజు అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించడం దళితులపై ఆయనకున్న అక్కసుకు నిదర్శనమన్నారు. దేశం గౌరవించే అంబేడ్కర్ను అవమానించిన ఎమ్మెల్యే పై కేసు నమోదు చేయాలని కోరుతూ డిఎస్పిపి జనార్ధన్ రావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బిఎస్పి నాయకులు కారుమంచి సునీల్ సందీప్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బోనిగల ప్రదీప్, గడ్డేటి సుందర్ సునీల్ కుమార్, గాలి వెంకట్,పిల్లి తిమోతి ,బొడ్డు డేవిడ్ ,అరిగప్రసాద్, పిల్లి దాసు, పిల్లి రాజేష్, సముద్రాల కన్నా ,వంపుగళ్ళ సురేష్, గోవతోటి మనోజ్, వి వేణు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

100 మంది యువకులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి పట్టణం రఘురాం నగర్ ప్రజావేదికలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఐదు కంపెనీలు చేపట్టిన ఎంపికల్లో సుమారు 100 మందికి ఉపాధి అవకాశాలు లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డి.నాగేశ్వరరావు, వై.రామస్వామి, టి.జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

మంచి పాలనంటే మద్యం అమ్మడమేనా? : ఐద్వా

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గత ప్రభుత్వం మద్యం అమ్మకాలే లక్ష్యంగా 2934 షాపులను, దొడ్డిదారిన సుమారు మరో 400 షాపుల ద్వారా నాణ్యత లేని మద్యాన్ని అమ్మి దాదాపు 30 వేల మంది ప్రాణాలను తీసుకుందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కార్యదర్శి భారతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నూతన ఎక్సైజ్ విధానంలో 4 వేలకుపైగా షాపుల ద్వారా మద్యం అమ్మకాలకు సిద్ధమవుతోందని విమర్శించారు. గత ప్రభుత్వం కంటే మంచి పరిపాలన ఇదేనా అని ప్రశ్నించారు. మద్యాన్ని నియంత్రించి ప్రజల ఆరోగ్యంతోపాటు మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం షాపులు నడవాలని, వారంలో ఒక రోజు డ్రైడే అమలు చేయాలని కోరారు. మద్యంపై వచ్చే ఆదాయంలో 2 శాతం మద్యం నిరోధించే కార్యాక్రమాలకు ఖర్చు పెట్టాలని కోరారు.

'ఉండి ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు పెట్టాలి'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చింపివేయడం దారుణమని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ అన్నారు. రొంపిచర్ల మండలం నల్లగార్లపాడు అంబేద్కర్ నగర్‌లో ఆయన ఆదివారం మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు లాంటి వ్యక్తులకు తెలియకపోవడం సిగ్గుచేటన్నారు. ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు. ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి- మాచర్ల

రోడ్లపై తోపుడు బండ్లు పెట్టి ట్రాఫిక్ అంతరాయం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్ఐ సంధ్యారాణి హెచ్చరించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై నిలుపుతున్న తోడుబండ్లు యజమానులకు, వాహనా దారులకు ఎస్ఐ ఆదివారం అవగాహన కల్పించారు. రోడ్డుపై వాహనాలు నిలపటం, తోపుడు బండ్లు పెట్టడం వలన పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. రోడ్డుపై ఎవరూ బండ్లను నిలపొద్దని చెప్పారు.

త్వరలో మెగా డీఎస్సీ : ఎమ్మెల్యే

సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - వినుకొండ

మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను కూటమి ప్రభుత్వం త్వరలోనే భర్తీ చేస్తుందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 11,12వ వార్డుల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ఆదివారం నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రూ.1674 కోట్లు ధాన్యం కొనుగోలు బకాయిలను చెల్లించారని, పేదల ఆకలి తీర్చడానికి రాష్ట్ర వ్యాప్తంగా 175 అన్న క్యాంటీన్లను పున:ప్రారంభించారని చెప్పారు. వినుకొండను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. ఘాట్ రోడ్డు, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం, టిటిడి కళ్యాణ మండపానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని, త్వరలో ఆ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఎన్ఎస్పి స్థలంలో జాషువా లైబ్రరీ, స్టేడియం, ప్రభుత్వ కార్యాలయాలు, షాపింగ్ కాంప్లెక్స్, పార్క్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. వినుకొండ పట్టణానికి శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించడమే తన ధ్యేయమన్నారు. డ్రెయినేజీ, విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. నిత్యం అందుబాటులో ఉంటానని, ఏ సమస్య ఉన్నా ప్రజలు తన దృష్టికి తేవాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, ఎన్.శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పీవీ సురేష్‌బాబు, జి.కోటేశ్వరరావు, ఆయుబ్ ఖాన్, షమీంఖాన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

ప్రజా సంక్షేమం, యువతకు ఉపాధి కల్పనే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని జమ్మలమడకలో ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ కాలంలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. ఉచిత ఇసుక విధానం ద్వారా భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవించే వారి జీవితాల్లో వెలుగులను ప్రభుత్వం నింపిందన్నారు. వచ్చే దీపావళి నుండి ఉచిత సిలిండర్ పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామంలోని డ్వాక్రా మహిళా సంఘాలకు మంజూరైన రూ.3.47 కోట్ల చెక్కులను అందజేశారు.

అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. జమ్మలమడకలో నిర్వహించిన పోషక మాసోత్సవాల్లో భాగంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సరుకులలో నాణ్యత లోపం లేకుండా చూడాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారులకు సేవలు అందించాలన్నారు. ఇదిలా ఉండగా మాచర్ల పట్టణంలోని జయంతి నగర్‌లో నివాసం ఉండే ఎందేటి అంకమ్మ గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన నేపథ్యంలో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నిత్యావసర సరుకులు, బియ్యం, రూ.5 వేల నగదు అందజేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, ఈ మేరకు అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇదిలా ఉండగా మాచర్ల పట్టణంలో టిడిపి నాయకులు డాక్టర్ వస్తుపురి గోవిందుకు చెందిన నూతన మెడికల్ షాపును ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో టిడిపి నాయకులు కె.దుర్గారావు, జె.అక్కిరెడ్డి, బాబు, ఎన్.వీరస్వామి, ఎస్.కుమార్, జి.శ్రీనివాసరావు, వజ్రంనాయక్, జి.సత్యనారాయణరెడ్డి, కె.కోటేశ్వరరావు, ఎంపీడీవో సరోజినీదేవి, గబ్రు నాయక్, సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నాయక్, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, ఎంఈవో ఎ.సురేష్, ఏపీవో నాగశ్రీను, డీటి శ్రీనివాసరావు వెలుగు సిబ్బంది దాసు, నాయకులు పుల్లయ్య, బి.వెంకటేశ్వర్లు చౌదరి, వి.శ్రీరామూర్తి, కె.సైదయ్య, జె.కొండలు పాల్గొన్నారు.

డొంకరోడ్లు, తాగునీటి సమస్యలపై ఎమ్మెల్యేకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలోని 88 తాళ్లూరులో ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో హాజరైన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు పలు ప్రజా సమస్యలపై సిపిఎం నాయకులు విన్నవించారు. తాళ్లూరు-ఉయ్యందన గ్రామాల రైతులు సుమారుగా 90 ఏళ్ల క్రితం నిర్మాణం చేసిన చెక్ డ్యాం క్రింద దాదాపు 100 ఎకరాల వరి సాగు చేస్తున్నారని, దానికి సత్వరం మరమ్మతులు చేయాలని కోరారు. గ్రామంలోని పొలాలకు వెళ్లడానికి ఆరు డొంక రోడ్లున్నా చాలా కాలంగా మరమ్మతులు చేపట్టకపోవడం వలన రైతులు రోజువారి పనులకు సంబంధించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్రామంలో దాతలు సహాయంతో తాగునీటి ట్యాంకును ఏర్పాటు చేసుకున్నా ఇప్పటికీ బోర్ల నీటినే తాగాల్సి వస్తోందని చెప్పారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీటి సరఫరాకు పైపులు వేసినా ఫిల్టర్ బెడ్ ద్వారా నీరు అందించడం లేదని తెలిపారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో విన్నవించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు, నాయకులు వి.వెంకటేశ్వర్లు, ఎ.వెంకటప్పారావు, వల్లశెంట్టి వెంకటేశ్వర్లు ఉన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పట్టణంలోని 2వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. 100 రోజుల పరిపాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరికపూడిశెల ప్రాజెక్టు పనులు సత్వరం చేపట్టాలి : సిపిఎం

జెండాను ఆవిష్కరిస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు ఎవికె దుర్గారావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కమ్యూనిస్టు రాజకీయాలే ప్రజలకు మేలు చేస్తాయని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం సిపిఎం పట్టణ శాఖ మహాసభ సయ్యద్ రబ్బాని అధ్యక్షతన జరిగింది. తొలుత సిపిఎం కార్యాలయం ఎదుట జెండాను సీనియర్ నాయకులు ఎవికె దుర్గారావు ఆవిష్కరించారు. ఎన్నికల ముందు టిడిపి ఇచ్చిన వాగ్దానం ప్రకారం సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ వెంటనే అమలు చేయాలని, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్, స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులను నిలిపేయాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ జూనియర్, పీజీ కళాశాలలు ఏర్పాటు చేసి జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలకు పక్కా భవనాలను నిర్మించాలని, నరసరావుపేట పట్టణంలో రవాణా రంగా కార్మికులకు ఆటోనగర్‌ను ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ దారులకు ఉచిత ఇసుకను సమర్థవంతంగా వినియోగించేటట్లు చూసి భవన నిర్మాణ కార్మికుల ఉపాధి కల్పించాలని కోరుతూ తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. అనంతరం తూర్పు శాఖకు కార్యదర్శిగా సయ్యద్ రబ్బాని, పడమర శాఖకు కార్యదర్శిగా సిలార్ మసూద్‌ను ఎన్నుకున్నారు. నాయకులు డి.శివకుమారి, ఇ.మస్తాన్‌రెడ్డి, ఎం.రాంబాబు, ప్రసాదు, మెటిల్డాదేవి, డి.సుభాష్ చంద్రబోస్, జె.శ్రీనివాసరావు, నాగమ్మ బాయ్, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మాచర్ల

స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ 3వ శాఖ మహాసభ ఆదివారం నిర్వహించారు. జెండాను సీనియర్ నాయకులు యు.రమేష్ ఆవిష్కరించారు. ఇటీవల మృతి చెందిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు తాత్విక్ మాట్లాడారు. వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని, మాచర్ల పట్టణ ప్రభుత్వ వైద్యశాలను వంద పడకల ఆసుపత్రిగా మార్చాలని, దుర్గి మిర్చియార్డ్‌లో కొనుగోళ్లు ప్రారంభించాలని, మాచర్ల పట్టణానికి తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం పైప్‌లైన్ పూర్తి చేయాలని, ఇఎస్ఐ క్లినిక్‌ను అన్ని వైద్య సదుపాయాలున్న హాస్పిటల్‌గా మార్చాలని, మాచర్ల ప్రభుత్వ కళాశాలలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలని, వరద ప్రభావం వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ఈ సందర్భంగా శాఖ కార్యదర్శిగా కె.వెంకటరత్నంను తిరిగి ఎన్నుకున్నారు.

జమిలి ఎన్నికలు సమాఖ్య విధానానికి విరుద్ధం

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు - శాఖ మహాసభల్లో పలు తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి-తాడేపల్లి

పచ్చి అవకాశవాదంతో బిజెపి తీసుకువస్తానంటున్న జమిలి ఎన్నికలు వద్దని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు చెప్పారు. ఆదివారం తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం ఏరియా, బోసుబొమ్మ సెంటర్ ఏరియా, కొత్తూరు సిపిఎం శాఖ మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మహాసభలకు గంజి శ్రీనివాసరావు, కోట బాబూరావు, డి.యోహాన్ అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ వివిధ జాతులు, మతాలు ఉన్న భారతదేశంలో సమైక్య స్ఫూర్తికి విరుద్ధమైన వాదనలను బిజెపి ముందుకు తీసుకొస్తుందని విమర్శించారు. జమిలి ఎన్నికలు జరపాలంటే అనేక రాజ్యాంగ సవరణలు జరగాల్సి ఉందని, దేశలో సగం రాష్ట్రాలు అందుకు సమ్మతించాలని తెలిపారు. పెరిగిన ధరలు, ప్రజలపై భారాలు ఎజెండా కాకుండా ప్రజల ను దారి మళ్లించడమే జమిలి ఎన్నికల సారాంశమని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో పూర్తి మెజార్టీ లేకపోయినా మిత్రపక్షాలపై ఆధారపడి ప్రభుత్వం నడుపుతున్న బిజెపి తమ మతతత్వ ఎజెండాను ఏమాత్రం తగ్గించుకోవడంలేదని చెప్పారు. దేశంలో తీసుకొచ్చిన క్రిమినల్ చట్టాలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఉద్యమాల అణిచివేసేందుకే ఈ చట్టాలను తీసుకొచ్చారన్నారు. వక్ఫ్ భూముల చట్టంలో జోక్యం చేసుకుని ముస్లిం మైనార్టీలకు సంబంధించిన ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టడమే బిజెపి అజెండా అని విమర్శించారు.

మాట్లాడుతున్న పాశం రామారావు

పలు తీర్మానాలు ఆమోదం : ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. కొండ చుట్టూ ఉన్న నివాస గృహాలను రెగ్యులరైజేషన్ చేయాలని, రైల్వే స్థలాల్లో ఎక్కడున్న వారికి అక్కడే పట్టాలు ఇవ్వాలని, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపర్చాలని, ఎంటిఎంసి కార్పొరేషన్ నుంచి తాడేపల్లిని విడగొట్టి ప్రత్యేక మున్సిపాలిటీగా చేయాలని తీర్మానించారు. కొత్తూరులో పశువుల ఆసుపత్రి వద్ద ఉన్న సింగిల్ లైన్ బ్రిడ్జిని డబుల్ లైన్ బ్రిడ్జి చేయాలని, అంజిరెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, ఇరిగేషన్, పోరంబోకు స్థలాల్లో ఉన్న వారికి పట్టాలు ఇవ్వాలని, అర్హులైన పేదలకు పింఛన్లు ఇవ్వాలని, పట్టణానికి కృష్ణానది నుంచి మంచినీరు అందించాలని తీర్మానించారు. మున్సిపల్ కార్యాలయం ఏరియా, బోసుబొమ్మ సెంటర్ శాఖ కార్యదర్శిగా కోట బాబూరావు, కొత్తూరు శాఖ కార్యదర్శిగా మోదుగుల శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కార్యదర్శి వర్గ సభ్యులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, గాదె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నిడమర్రు మహాసభలో పలు తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆదివారం నిర్వహించిన నిడమర్రు శాఖల మహాసభలో పలు తీర్మానాలను ఆమెదించారు. మంగళగిరి నుండి అమరావతి వరకు గల రోడ్డు అధ్వానంగా తయారైందని వెంటనే రోడ్డు నిర్మాణం చేసి ఆర్టీసీ బస్సులను పునః ప్రారంభించాలని, గ్రామాలలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను సరిచేసి మురుగునీటి పారుదలకు చర్యలు చేపట్టాలని, అర్హులకు పెన్షన్లు, రేషన్ కార్డులను ఇవ్వాలని, నిడమర్రు రోడ్డు వైపు గల రైల్వే క్రాసింగ్ లైన్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలని, ప్రతి గ్రామంలో శ్మశాన స్థలా సమస్యను పరిష్కరించాలని, ప్రభుత్వ భూముల్లో ఇళ్లు లేని వారికి ఇళ్లస్థలాలు కేటాయించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సిపిఎం నిడమర్రు శాఖల మహాసభలను నిడమర్రు చారువాక విద్యాపీఠంలో జి నాగేశ్వరరావు ఎం.ప్రసన్నకుమార్ల అధ్యక్షతన నిర్వహించారు. మహాసభలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతు తిరుపతి లడ్డు లో కల్తీ జరిగిందని ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులపై తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కల్తీ పేరుతో మతోన్మాద శక్తులు రాష్ట్రంలో ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు జరిగే ప్రమాదం లేకపోలేదన్నారు. అటువంటి శక్తుల యెడల అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ రాజధాని నిర్మాణా పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. రాజధాని నిర్మాణానికి నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. రాజధానిగ్రామాల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. అనంతరం నూతన కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఒకటవ శాఖకు కార్యదర్శిగా కట్టేపోగు వెంకటేశ్వర్లు ,రెండవ శాఖకు కార్యదర్శిగా గైరుబోయిన నాగేశ్వరరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం భాగ్యరాజు వల్లభాపురం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత సిపిఎం జెండా ఆవిష్కరణ, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నిడమర్రు మహాసభలో జెండా ఆవిష్కరణలో నాయకులు

మురుగునీటి వ్యవస్థను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం పాత గుంటూరు సీపీఎం శాఖ మహాసభ టీ.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నళినీకాంత్ మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్తూ, సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి జాతికి అంకితమై పనిచేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు శివారు కాలనీలు నీటమునిగాయని, మురుగునీటి పారుదల వ్యవస్థను అభివద్ధి చేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మహాసభలో సీపీఎం పాత గుంటూరు శాఖ కార్యదర్శిగా శనగపల్లి కార్తీక్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నగర నాయకులు కే.శ్రీనివాస్, ముత్యాలరావు, ఎల్ అరుణ, కే గంగాధరరావు, సైదా, రషీద్ పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న కె నళినీకాంత్

సీనియర్ పెన్షనర్లను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

డిజిటలైజేషన్ ద్వారా పెన్షన్లు అందించాలి

ప్రజాశక్తి-గుంటూరు

పొగాకుబోర్డు పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం గుంటూరులోని పొగాకుబోర్డు రైతు భవన్‌లో నిర్వహించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ బిఎన్.మిత్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు యు.వెంకటరావు, పొగాకుబోర్డులో దీర్ఘకాలం సేవలు అందించిన కర్ణాటక, ఆంధ్రాలో ఉన్న రిటైర్డ్ పొగాకు బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం లైవ్ సర్టిఫికెట్ పద్ధతి కాకుండా డిజిటలైజేషన్ ద్వారా సరళమైన విధానంలో పెన్షన్లు పొందేలా కృషి చెయ్యాలని ప్రతినిధులు కోరారు.ఈ సందర్భంగా 75 సంవత్సరాల వయసు నిండిన సీనియర్ పెన్షనర్లు నన్నపనేని అమర్నాథ్, ఎపివివి స్థాపక్‌ను సన్మానించారు. వారు పొగాకు రైతులకు చేసిన సేవలను సంఘ సభ్యులు కొనియాడారు.

జిజిహెచ్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రోగి ఆరోగ్యంగా ఇంటికి వెళ్లాలంటే వైద్యంతో పాటు పరిసరాలు కూడా శుభ్రంగా ఉండాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్వచ్ఛహీ సేవా కార్యక్రమం భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చీపురు చేతబట్టి గోడలకు రంగులు వేసి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరు చేతులు కలపాలని కోరారు. ఆసుపత్రి లో పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు వాలంటీర్లు ముందుకు రావాలని ఆయన సూచించారు. ఆసుపత్రిలో పారిశుధ్యం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసుకుంటూ పరిసరాలను శుభ్రంగా ఉండే విధంగా చర్య లు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఆస్పత్రిలో శానిటేషన్ సిబ్బంది ఎంతో చక్కగా పనిచేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్, అడ్మిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

జగన్ ఇంటిపై దాడికి వైసిపి నాయకుల ఖండన

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లిలోని మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటిపై ఆదివారం బిజెపి గూండాలు దాడి చేయడాన్ని తాడేపల్లి వైసిపి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, ఎంటిఎంసి అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి ఖండించారు. ఇది పిరికిపందల చర్య అని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దుర్మార్గాలకు తావు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సిఎంను బిజెపి నాయకులు దూషించడం మంచిది కాదని హితవు పలికారు. వైసిపి కేంద్ర కార్యాలయంపై కూడా దాడి చేయడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు.

ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో

25న మండల కేంద్రాల్లో నిరసనలు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

రైతు, కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, 25న బుధవారం ఉదయం 10 గంటలకు పెదనందిపాడు, కాకుమాను మండలాల తహశీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు పిలుపినిచ్చారు. ఆదివాకం పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో నిరసన ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం కింద ఇస్తానన్న రూ.20వేలు వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలన్నారు. అధికవర్షాలతో నష్టపోయిన పరిహారం చెల్లించాలని, రైతు సేవా కేంద్రాలలో విత్తనాలు ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలన్నారు. కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి, పంట రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం 25న నిరసన కార్యక్రమాల్లో రైతులు, కౌలు రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పెదనందిపాడు, నాగులపాడు గ్రామాలలో కరపత్రాల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు, కౌలురైతు సంఘం నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, చుక్కా యానాదులు, దొప్పలపూడి రమేష్ బాబు, జంపని రామారావు, కాపు వెంకట సుబ్బారావు, గారపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్య నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్

ప్రజాశక్తి-గుంటూరు

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సంజీవయ్య నగర్ మూడవ లైన్‌లో రూ.5.5 లక్షలతో ఏర్పాటు చేసిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఆదివారం ప్రారంభించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల సంజీవయ్య నగర్ విద్యుత్ వినియోగదారులకు లో ఓల్టేజి సమస్య తీరుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబు, డిఇఇలు పిహెచ్.ఖాన్, ముస్తాక్ అహ్మద్, ఏఈ ఎం.రవికుమార్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణలో నాయకులు

ఆటో నగర్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు :సిఐటియు దేశవ్యాప్తంగా డిమాండ్స్ డే పిలుపులో భాగంగా ఈనెల 30న గుంటూరు వెంకటేశ్వరా విజ్ఞాన మందిరం నుండి కలెక్టరేట్ వరకూ జరిగే కార్మిక ప్రదర్శన, అనంతరం ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు.ఆదివారం ఆటోనగర్‌లో డిమాండ్స్‌డే కరపత్రాలను కార్మికులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సాంబశివరావు, కె.శ్రీనివాసరావు, కోశాధికారి దయానందం మాట్లాడుతూ ఆటో నగర్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం, కార్మిక చట్టాలు, మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఫ్యాక్టరీ అధికారులు తనిఖీలు పూర్తిగా మానివేశారని, దీనివలన ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు చట్టబద్ధమైన పి.ఎఫ్, ఇఎస్ఐ, బోనస్ లాంటి సౌకర్యాలు, మౌలిక సౌకర్యాలైన బాత్‌రూం, మంచినీటి సౌకర్యాలు కూడా కల్పించట్లేదన్నారు. 30న ర్యాలీ, ధర్నాలో ఆటో నగర్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గాలి శ్రీనివాసరావు, రామారావు, కిరణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

జీతాలందక విద్యుత్ కార్మికుల అవస్థలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రతి ఇంటికీ విద్యుత్ సరఫరాలో కార్మికుల అవసరం ఉంటుంది. పల్లె నుండి పట్టణాల వరకు వారి అవసరం తప్పనిసరి. విద్యుత్ సరఫరా నిమిత్తం కార్మికులు నిరంతరాయంగా పని చేయాలి. వారు లేకుండా ఏ చిన్న కరెంటు తీగ లాగాలన్నా కుదరదు. ప్రతి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టులపై పని చేసే కార్మికులు ఉన్నారు. వారికి ఉద్యోగభద్రతను కల్పించడంలో ప్రభుత్వాలు మొండిచేయి చూపుతోంది. కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వక ఇబ్బందులకు గురి చేస్తోంది. దీంతో వారి కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి. సమానపనికి సమాన వేతనం ఇవ్వకపోగా నెలావారీ జీతాలు కోసం అవస్థలు పడుతున్నారు. అలాంటి పరిస్థితే చిలుకలూరిపేట నియోజకవర్గ పరిధిలో నెలకొంది.

చిలకలూరిపేట నియోజకవర్గంలో సబ్‌స్టేషన్లు మొత్తం 22 ఉన్నాయి. వీటిలో గణపవరం సబ్‌స్టేషన్లో మాత్రమే శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. మిగిలిన 21 సబ్ స్టేషల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే పని చేస్తున్నారు. పట్టణంలో రెండు జోన్లు, యడ్లపాడు, నాదెండ్ల జోన్లు కలపుకుని మొత్తం 22 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వాటిల్లో చిలకలూరిపేట జోన్ 1లో (52 ఎకరాల వద్ద, మద్దినగర్, ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఉన్న విద్యుత్ ప్రధాన కార్యాలయంలో ఒక సబ్ స్టేషన్, వెంకటేశ్వర హాల్, రూత్ డైకెమెన్ నగర్, కొమరవల్లిపాడు)మొత్తం 6, పేట జోన్ రెండుగా(పురుషోత్తమ పట్నం,కష్నా నగర్, పసుమర్రు) రూరల్ ప్రాంతాలలో అన్ని పల్లెల్లోవి కలపుకుని (యడవల్లి, మురికిపూడి, మద్దిరాల, పసుమర్రు)నాలుగుగా ఉన్నాయి. యడ్లపాడు మండల పరిధిలో (ఎడ్ల పాడు, తిమ్మాపురం, బోయపాలెం, కొండవీడు స్పైసెస్ పార్క్)మొత్తం ఐదుగాను.. నా దెండ్ల మండలం (గణపవరం,సాతులూరు,నాదెండ్ల, అవిశాయపాలెం) మొత్తం నాలుగుతో కాలపు కుని మొత్తం 22 సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 110 నుంచి 160/ 170 మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వివిధ రకాలైన విధులను నిర్వహిస్తున్నారు. వారిలో వివిధ విభాగాల్లో మీటర్ రీడర్లో, షిఫ్ట్ ఆపరేటర్లు, టెక్నికల్ ఆపరేటర్లు బిల్లు కలెక్టర్లుగా అనేక విభాగాలలో కార్మికులు పని చేస్తున్నారు. సంవత్సరాల కాలంగా పని చేస్తున్నా వీరిని క్రమబద్ధీకరణ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. కనీసం ఈ కూటమి ప్రభుత్వంలోనైన పట్టిం చుకుని రెగ్యులరైజ్డ్ చేస్తారేమేననే ఆశాభావ వ్యక్తం చేస్తున్నారు. 2019 ఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డి రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదని వాపోయారు. ఒకే పనిని శాశ్వత ఉద్యోగులతో సమానంగా చేసే అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను వేతనాల్లో తేడాలు చూపి పని మాత్రం చేయించుకుంటున్నారన్నారు. సబ్‌స్టేషన్లలో వాచ్‌మెన్లను ఇతర పనులకూ వాడుకుంటున్నారని అన్నారు. రాత్రులు షిఫ్ట్ ఆపరేటర్లు బిక్కిబిక్కు మంటూ పనిచేయాల్సి వస్తుందంటున్నారు. 8 గంటలు పని చెయ్యాల్సిన ఉద్యోగులు 24 గంటలు పనులు చేయిస్తున్నారంటూ వాపోయారు. విధి నిర్వహణలో ప్రమాదాలు చోటు చేసుకుంటే ఎలాంటి వైద్య సదుపాయాలు అందడం లేదన్నారు. మరణించిన కార్మికులకు టుంబాలకు కనీసం నష్టపరిహారం వారి కుటుంభ సభ్యులకు పెన్షన్ ఇవ్వడం లేదనివాపోయారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని కోరారు.

తక్షణమే రెగ్యులర్ చేయాలి:

పేరుబోయిన వెంకటేశ్వర్లు(సిఐటియు మండల కన్వీనర్

విద్యు త్ సంస్థల్లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలి. పదిసంవత్సరాల నుంచి పని చేస్తున్న వారికి ఇంక్రిమెంట్లు వెంటనే ఏర్పాటు చేయాలి. ఇంక్రిమెంట్ల బకాయిలను వెంటనే చెల్లించాలి. సమాన పనికి సమాన వేతనం విద్యుత్‌రంగంల్లో పనిచేస్తున్న వారికి వెంటనే అమలు చేయాలి. మెడికల్ పిఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలు కల్పించాలి.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

విధి నిర్వహణలో పట్టణ ప్రజలు, పారిశుధ్య కార్మికుల అభిమానాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్ చూరగొన్నారని సిపిఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ అన్నారు. చిలకలూరిపేట మున్సిపాల్టీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ షేక్ ఇస్మాయిల్ బదిలీపై వినుకొండ మున్సిపాలిటీకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆదివారం సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి నాయకులు, పారిశుధ్య కార్మికులు ఇస్మాయిల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగబైరు సుబ్బాయమ్మ మాట్లాడుతూ అన్నివర్గాలకు చెందిన ప్రజల మన్ననలు పొందుతూ సేవలందించే అధికారులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. అటువంటి వారిలో ఇస్మాయిల్ ఒకరని కొనియాడారు. పారిశుధ్య కార్మికుల సమస్యల విషయంలోనూ ఇస్మాయిల్ సానుకూలంగా స్పందించే వారని, సమస్యలను పరిష్కరిస్తూనే పట్టణ పారిశుధ్యంలో రాజీలేకుండా విధులు నిర్వహించారన్నారు. శానిటరీ ఇన్సెపెక్టర్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడు తూ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని, కానీ చిలకలూరిపేటలో పనిచేసిన కాలం మరిచిపోలేనని, ఎంతో మంది ఆప్తులను మిత్రులను సంపాదించుకున్నానని అన్నారు. తన విధులలో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు, మున్సిపల్ వర్క ర్స్ యూనియన్ నాయకులు కొమరగిరి చెంచయ్య, పుటల అక్కులయ్య, కె.బాలకోటి, యకసిరి ఆదినారాయణ, గంగాధర్, ఎ.అంజయ్య, ఆవుల పోతురాజు, పి సురేష్, దేవసహా, ఎం.నాగేశ్వరరావు, జయరావు పాల్గొన్నారు.

షేక్ ఇస్మాయిల్‌ను సన్మానిస్తున్న నాయకులు, కార్మికులు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - వినుకొండ

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక పల్నాడు రోడ్‌లోని పుతుంబాక వెంకటపతి భవన్‌లో శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని యుటిఎఫ్ సీనియర్ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు ఎ.నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం 150 మంది ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగ కుటుంబ సభ్యులు కంటి పరీక్షలు చేశారు. 20 మందికి కంటి శుక్లాలు, ఇతర సమస్యలతో ఆపరేషన్ల అవసరమని గుర్తించి వారికి ఇహెచ్ఎస్ ద్వారా ఆపరేషన్లు చేస్తామని వైద్యులు చెప్పారు. పదిమందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శులు ఎం.రవిబాబు అజయ్‌బాబు మాట్లాడుతూ విద్యా విషయాలతో పాటు ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం, సామాజిక బాధ్యతలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం యుటిఎఫ్ నిర్వహించే సామాజిక కార్యక్రమాలకు మంచి స్పందన వస్తోందన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు నాగేంద్రుడు మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనంతో పాటు సామాజిక స్పృహ కలిగిన సంఘం యుటిఎఫ్ అని అన్నారు. కార్యక్రమంలో శంకర కంటి ఆస్పత్రి వైద్యులు వందన, కాళీ ప్రసాద్, సిబ్బందితోపాటు ఉపాధ్యాయులు పోలయ్య, జిలాని, సూర్యప్రకాశ్రావు, భాస్కరరావు, మల్లికార్జునరావు, నాగేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మండలంలోని సుగాలి కాలనీ మహిళలకు, లింగంగుంట్ల విలన్ స్పిన్నింగ్ ప్యాక్టరీలో కార్మికులకు 'నీకు తెలుసా హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ గూర్చి'పై అవగాహనా సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిటిసి కౌన్సిలర్ డాక్టర్ కాకుమాను హనుమంతరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ, క్యాంపు స్వచ్ఛంద సంస్థలు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిల్లోనే ఐసిటిసి ఆధ్వర్యంలో నిర్వహించారన్నారు. కార్యక్రమంలో క్యాంపు ప్రాజెక్టు మేనేజర్ రోహిణి, కంపెనీ వైస్ ప్రెసిడెంట్ గోపాల్ రెడ్డి, ఆశ వర్కర్స్, అవుట్ రిచ్ వర్కర్స్, స్వాతి, లక్ష్మి, పెద్దబ్బాయి పాల్గొన్నారు.

25న చెకుముకి సైన్స్ పరీక్ష

ప్రజాశక్తి - చిలకలూరిపేట

శాస్త్రీయ దక్పథాన్ని విద్యార్థి దశలోనే బాలలకు అలవాటు చేయాలనే సంకల్పంతో జనవిజ్ఞాన వేదిక (జెవివి) ప్రతి సంవత్సరం చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తోందని జవహర్ నవోదయ మాజీ ప్రిన్సిపాల్ సిహెచ్ ప్రభాకరరెడ్డి అన్నారు. స్థానిక సాధినేని చౌదరయ్య పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జనవిజ్ఞాన వేదిక డివిజన్ సమావేశంలో ఆయన సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జెవివి గౌరవాధ్యక్షులు పి.వి. సుబ్బారావు మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన, వచ్చేనెల 1న పాఠశాల, మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఉంటాయని చెప్పారు. ఈ ప్రతిభా పరీక్షలకు విద్యార్థులను అధిక సంఖ్యలో పంపించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి డి.బుజ్జిబాబు, ఉపాధ్యక్షులు కె.రామ్మోహనరావు, సమతా అధ్యక్షులు టి.కుమారి, జిల్లా గౌరవాధ్యక్షులు చుక్కా విన్సెంట్ పాల్, రిటైర్డ్ ఎక్సైజ్ సిఐ గోరంట్ల నారాయణ, న్యాయవాది మాదాసు భానుప్రసాద్, ధూళిపాళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆపరేటర్ వసంతరావు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఇటీవల కాలంలో ఈస్ట్‌పల్లె ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ చనిపోయిన డేటా ఎంట్రీ ఆపరేటర్ వసంతరావు మొదటి సంస్మరణ సభను ఏపీ రాష్ట్ర డేటా ఎంట్రీ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మాదల రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక పండ రీపురం సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా వసంతరావు భార్య పాస్టర్ల శిరీషకు రూ.77,521 చెక్కును, అతని కుమారులైన కాసర్ల హర్షిత్‌కు, కాసర్ల ప్రదీప్ చంద్రలకు చెరో రూ.లక్ష ఫిక్సిడ్ డిపాజిట్ బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా పుల్లారావు మా ట్లాడుతూ యూని యన్గా ఉన్న అందరూ తల చెయ్యి వేసి వీరి కుటుంబాన్ని ఆదుకోవడం సంతోషదాయక మన్నారు. యూనియన్ల వల్ల ఇటువంటి అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఈ కుటుంబాన్ని ఆదుకున్న ప్రతిఒక్కరినీ పేరుపేరునా అభినందించారు. అనంతరం ఏపి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌హెచ్‌ఎం డేటా ఎంట్రీ ఆపరేటర్స్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా తిరిగి మాదల రామకృష్ణను, జనరల్ సెక్రెటరీగా శ్రీనివాస భుజంగరావును, కోశాధికారిగా పి.అంజాద్ ఖాన్, కమిటీ వర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్స్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
సోమవారం 23 సెప్టెంబర్ 2024

రోడ్డు తవ్వారు - ప్రమాదకరంగా వదిలేశారు

తవ్వేసిన రోడ్డును

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అధికంగా చినకాకాని గ్రామంలో నీరు చేరింది. విద్యుత్ సబ్ స్టేషన్‌లో నీరు నిల్వకుండా ఉండేందుకు ప్రత్యామ్నయంగా రోడ్డును తవ్వి ఆ నీటిని బయటకు పంపించారు. అయితే రహదారిని తవ్వి రాకపోకలకు అంతరాయానికి వదిలేశారు. నేటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు వాపోతున్నారు. పగలుగొట్టిన రోడ్డు గురించి విద్యుత్ అధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. చినకాకాని గ్రామం నుంచి జాతీయ రహదారి వైపు కానీ మంగళగిరి వైపు రావాలంటే రైతులు, విద్యార్థులు సామాన్య ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ్ళలో రహదారి కనపడక పడిపోతున్నారని వాపోతున్నారు. అంతేగాక ఈ దారిలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఎన్నో సంవత్సరాల నుంచి విద్యుత్ శాఖ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదంటున్న గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామంలో వెళ్లడానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.

రైల్వే గేటుతో రాకపోకలకు ఇక్కట్లు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో ప్యారీ కంపెనీ వద్ద గల రైల్వే గేటు పడిందంటే ఈ మార్గాన వెళ్లే వాహనదారులు ఒక్కోసారి గంటల తరబడి సమయాన్ని వెచ్చించాల్సి వస్తోంది. బైపాస్ రోడ్డు నిర్మాణం అయిన తరువాత బహుళ అంతస్తుల భవనాలు ఈ ప్రాంతంలో పెద్దఎత్తున పెరిగాయి. తాడేపల్లి నుంచి రాకపోకలు ఈ రైలుగేటు మీదగానే అధికంగా వెళ్తుంటారు. అయితే రైలు గేటు పడిందంటే ఎక్కువ సమయం తెరుచుకోదు. దీంతో అక్కడి స్థానికులు అత్యవసర పరిస్థితులలో ఇబ్బందులకు గురవుతున్నారు. అక్కడ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు. 70 ఏళ్ల క్రితం అప్పట్లో పెద్దగా రాకపోకలు లేని సమయంలో ఈ గేటు ఏర్పాటు చేశారు. విజయవాడ నగరంతో నిత్యం తాడేపల్లి వాసులు వివిధ పనుల కోసం వెళ్తూ ఉంటారు. రైల్వే గేటు పడటం వల్ల ఒక్కో సారి సమయానికి చేరుకోలేకపోతున్నామని చిరుద్యోగులు వాపోతున్నారు. విజయవాడ నుంచి చెన్నై మెయిన్ లైన్ కావడంతో నిత్యం రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. సుమారు రోజూ 150 నుంచి 200 రైళ్లు ఈ మార్గంలో తిరుగుతూ ఉంటాయి. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సిపిఎం అనేక సార్లు రైల్వే అధికారులతో పాటు పంచాయతీ దగ్గర నుంచి ఎంటిఎంసి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎటువంటి స్పందనా కానరావడంలేదని స్థానికులు విన్నవిస్తున్నారు.

వరద బాధితులకు చిన్నారుల విరాళం

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక సంగడిగుంటలోని అయ్యప్ప రెసిడెన్సీ అపార్టుమెంట్ చిన్నారులు దాతృత్వం చాటుకున్నారు. వరద బాధితుల సహాయార్థం రూ.21,534లను తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కార్యాలయంలో ఎమ్మెల్యేకి అందజేశారు. వీరంతా నగరంలోని వివిధ పాఠశాలల్లో ఒకటో తరగతి నుండి తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులు, వరదలలో ఎంతోమంది ఆకలిదప్పికలతో తిండి లేక అలమటించిన విషయాలను చిన్నారులు టీవీలలో చూసి చలించి, వారు దాచుకున్న పాకెట్ మనీ, కొంత తల్లిదండ్రుల నుండి సేకరించి విరాళంగా అందించారు. వరదలలో ఎంతో మంది విద్యార్థుల పుస్తకాలు తడిచిపోయాయని, కొంతమందికైనా తాము అందజేసిన డబ్బులతో పుస్తకాలు కొని ఇవ్వాలని వారు ఎమ్మెల్యేని కోరారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ప్రత్యేకంగా అభినందించి, వారికి చాక్లెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాగదర్, సుహాస్, శ్రీనిధి, పావని, రితిక, దాశరధి విఘ్నేశ్వర్, నిత్య, దినేష్, ఆర్యవైశ్య నాయకులు కొనకళ్ళ సత్యం, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఉత్సవ కమిటీ కన్వీనర్ కోటా శేషగిరి, చలమయ్య కాలేజీ ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి గురజాడ రచనలు

ప్రజాశక్తి - తెనాలిరూరల్

తెలుగు భాష వికాసానికి కృషి చేసిన గిడుగు రామ్మూర్తి ఆశయాల జాడ గురజాడ అప్పారావు అని సాయిమంగ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కంకిపాటి రమేష్ కుమార్ అన్నారు. గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయంలో జయంతి సభ నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు రమేష్ కుమార్ మాట్లాడుతూ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో గురజాడ అప్పారావు ఒకరని అన్నారు. రచయితగా, సంఘ సంస్కర్తగా, సాహితీవేత్తగా, హేతువాదిగా, అభ్యుదయ కవిగా గురజాడ చేసిన రచనలు నేటికీ ప్రజల మన్ననలను పొందుతున్నాయన్నారు. గురజాడ రూపొందించిన కన్యాశుల్కం నాటకం ప్రాచుర్యం పొందిందన్నారు. సమాజంలో దురాచారాలను రూపుమాపేందుకు ఆయన రచించిన దేశభక్తి గేయాలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. నేటి తరం విద్యార్థినీ విద్యార్థులకు గురజాడ అప్పారావు ఆదర్శ ప్రాయులని సంస్థ సభ్యులు హకీం జాని వివరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బి సుధాకర్, బొల్లిముంత కష్ణ, అవధానుల సత్యదేవ్, దేసు సురేష్ బాబు, రత్నాకర్, బి ప్రశాంత్ కాకుమాను కిరణ్ ఉమాశంకర్, బొమ్ము రామకష్ణ రెడ్డి పాల్గున్నారు.

100 రోజుల ప్రభుత్వ పాలనపై ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి పథకాలను వివరిస్తూ, వంద రోజుల పరిపాలనపై ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో ఆదివారం టిడిపి నాయకులు విస్తృత ప్రచారం చేశారు. గ్రామంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న సమస్యలను తమకు తెలియజేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో టిడిపి వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, టిడిపి వడ్డేశ్వరం గ్రామ ప్రధాన కార్యదర్శి మద్దినేని సుబ్రహ్మణ్యం, కొడవటి వాణి, వడ్డేశ్వరం రాజారావు, కామినేని మౌనిక, వంగూరి బీముడు, గుంపిన నాగేశ్వరరావు, కె.గోపాలకష్ణయ్య, కాట్రగడ్డ లక్ష్మణరావు, ఎస్‌కె.అన్వర్‌భాష పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంచుతున్న టిడిపి నాయకులు

మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ బదిలీ

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖలో జరుగుతున్న బదిలీలులో భాగంగా మంగళగిరి సబ్ రిజిస్టర్ షరీల్‌బాబు గుంటూరు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తెనాలిలో పనిచేస్తున్న బాల గురవయ్య మంగళగిరి రానున్నారు.

మూడు రాజధానుల ఉద్యమ కూలీలకు మోసం

ప్రజాశక్తి - మంగళగిరి : మూడు రాజధానుల ఉద్యమంలో పాల్గొన్న కూలీలకు డబ్బులు ఇవ్వలేదంటూ మాదిగ ఆర్థికాభివృద్ధి చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బేతపూడి సాంబయ్య అన్నారు. ఆదివారం మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ మాదిగ ఆర్థికాభివృద్ధి చైతన్య సమితి ఆధ్వర్యంలో మూడు రాజధానుల ఉద్యమంలో 1200 రోజులపాటు పాల్గొన్న వృద్ధులు, మహిళలు, దళిత కూలీలకు వైసిపి మాజీ ఎంపీ నందిగం సురేష్ డబ్బులు ఇవ్వలేదన్నారు. ఉద్యమంలో పాల్గొన్న పలుమార్లు డబ్బులు ఇస్తానని చెప్పి సమయమైన వెంటనే వెళ్లిపోండని దాటవేయించాడని అన్నారు. రాష్ట్రంలో మూడు రాజధానులు ఏర్పాటైతే అన్ని ప్రాంతాల్లో పరిపాలన వికేంద్రీకరణ జరిగి ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని నమ్మి మోసపోయామన్నారు. సుమారు రూ.10 నుంచి రూ.15లక్షల వరకు కూలీలకు డబ్బులు ఇవ్వాల్సి ఉందని వివరించారు. నందిగం సురేష్‌ను మాదిగలకు ప్రతినిధిగా ఉంటారనే ఉద్దేశంతో మాజీ సీఎం జగన్ ప్రాధాన్యత ఇచ్చారన్నారు. వాస్తవానికి అతను మాదిగలపైనే దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు.

టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఆటోనగర్ రుచి హోటల్ ఆవరణలో అమరావతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. దీనికి సీనియర్ టైలర్ భావనారాయణ అధ్యక్షత వహించి అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షునిగా షేక్ నాగుల్ మీరా, ప్రధాన కార్యదర్శి జంజనం వెంకట సాంబశివరావు(జేఎస్‌ఆర్)లతోపాటు ఏడుగురు కార్యవర్గ సభ్యులు భావనారాయణ, నల్లమోలు సుబ్రహ్మణ్యం, చాదరాసుపల్లి భాస్కర్, బాపనపల్లి అంజయ్య, ఆలీ, ఆంజనేయులు షేక్ అన్వర్‌లతో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్లోకి రెడీమేడ్ దుస్తులు రావడంతో టైలర్‌వృత్తి గణనీయంగా తగ్గిపోయిందన్నారు. ఆ వృత్తిపై ఆధారపడిన వారు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం టైలర్ వృత్తిదారులను ఆదుకోవాలని కోరారు. భవిష్యత్తులో మంత్రి నారా లోకేష్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించు కుంటామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ టైలర్స్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు చనిపోయిన విషయం తెలిసింది. పెదనందిపాడు మండలం వరగాని-కాట్రపాడు మధ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డారు. గోగులమూడి గ్రామానికి చెందిన షేక్ సుభాని ఆయన భార్య మాధురీ పెదనందిపాడు వచ్చి బైక్ పై తిరిగి తమ గ్రామానికి వెళు తుండగా మార్గమధ్యంలో వరగాని కాట్రపాడు మధ్యలో మలుపు వద్ద బైకు జారీ నీటి కుంటలో జారిపడ్డారు. ఈ ప్రమాదం లో బైకు పై వెనక కూర్చున్న మాధురి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సప పొందుతూ మృతి చెందింది. సుభాని తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. అలాగే పల్నాడు జిల్లా పిడుగురాళ్ల ఆంధ్రా బ్యాంకు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. రోడ్డుదాటుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తిని ఏపూరి సత్యనారాయణ (65)గుర్తించారు. పట్టణ ఎస్‌ఐ మోహనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జెడ్పీ సిఇఒగా జ్యోతిబసు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న వి.జ్యోతిబసు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు. అలాగే గుంటూరు జెడ్పీ డిప్యూటీ సిఇఒగా విజయనగరం డ్వామా ఎపిడిగా పనిచేస్తున్న సిహెచ్.కృష్ణ నియమితులయ్యారు.ప్రస్తుత గుంటూరు డిప్యూటీ సిఇఒ జె.మోహనరావు నెల్లూరు డిప్యూటీ సిఇఒగా బదిలీ అయ్యారు. కాగా ఇప్పటి వరకూ సిఇఒగా పనిచేసిన వసంతరాయుడిని మదర్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

పెరటి తోట పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కమిషనర్, తదితరులు

గ్రీన్ సిటీగా గుంటూరు

ప్రజాశక్తి-గుంటూరు

రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో ఆదివారం మిద్దెతోట/పెరటి తోటల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ గుంటూరును గ్రీన్ సిటీగా మార్చుదామని పిలుపునిచ్చారు. మిద్దెతోట చేస్తున్న వారిని అభినందిస్తూ, మిద్దె తోట చేస్తున్న వారికి సాంకేతిక సలహాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మిద్దెతోట నిపుణులు తుమ్మేటి రఘోత్తమరెడ్డి రచించిన 'పెరటి తోట' పుస్తకాన్ని కమిషనర్ శ్రీనివాసులు ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన నిపుణులు సేంద్రియ పద్ధతుల్లో మిద్దె/పెరటి తోటల పెంపకంతో కూరగాయలు, ఆకుకూరల పెంపకం, మట్టి, విత్తనాలు, ఎరువుల ఎంపిక, వినియోగం, చీడపీడల నివారణకు ఉపయోగించే కషాయాలు, ద్రావణాలు, సేంద్రియ విధానంలో మొక్కలకు పోషణ అందించే పద్ధతులు, కూరగాయ పంటల్లో అధిక దిగుబడికి సూచనలు తెలియజేసారు. నీటి యాజమాన్యం, సస్యరక్షణ, పరికరాలు, ఎరువుల యాజమాన్యంపై అనుభవజ్ఞులచే అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఆలపాటి సత్యనారాయణ, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ధర్మజ, వెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రెసిడెంట్ మస్తానయ్య, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, లతాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, నగర కమిషనర్ తదితరులు

స్వచ్ఛత సమిష్టి బాధ్యత

జిఎంసి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా స్వచ్ఛత సాధించవచ్చని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ స్వచ్ఛత హిసేవాలో భాగంగా ఆదివారం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌తో కలిసి జిఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు ఈనెల 17 నుండి అక్టోబర్ 2 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామాల్లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. వివిధ వర్గాల సంస్థలు, ప్రజలు భాగస్వాములు కావడం ద్వారానే స్వచ్ఛత సాధన వీలవుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రం ఒక్క ప్రజారోగ్య కార్మికులదే భాధ్యత కాదని, ప్రతి ఒక్కరూ భాధ్యత తీసుకొని, వ్యర్ధాలను రోడ్లమీద, కాల్వల్లో వేయకుండా ఉండాలని తెలిపారు. స్వచ్ఛతను పాటించడం ప్రతి ఒక్కరూ ఒక ఉద్యమంగా భావించాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్వచ్ఛత సమిష్టి భాధ్యత అని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛతకు కృషి చేయాలన్నారు. నగర కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి జిఎంసి నుండి చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం విరివిగా ఉంటుందన్నారు. అందులో భాగంగా మొక్కలు నాటడం, ప్రజారోగ్య కార్మికులకు వైద్య పరీక్షలు, ఇన్స్యూరెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం సైకిల్ ర్యాలీ పోలీస్ పెరేడ్‌గ్రౌండ్ నుండి శంకర్ విలాస్ సెంటర్, గుజ్జనగుండ్ల, పట్టాభిపురం మీదుగా తిరిగి పెరేడ్‌గ్రౌండ్ వరకూ జరిగింది. కార్యక్రమంలో జిఎంసి డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్‌ఈ శ్యాంసుందర్, ఎంహెచ్‌ఓలు మధుసూదన్, రామారావు, రాంబాబు, ఆనందకుమార్, ట్రాఫిక్ డిఎస్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు

- 20 నుంచి అక్టోబరు 15 వరకు రూపకల్పన
- స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంతో ప్రజల నుంచి సలహాలు స్వీకరణ
- అన్ని రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అడుగులు
- ప్రజాశక్తి తో సిపిఒ పి.శేషశ్రీ

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా త్వరలో మండల, జిల్లా స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేషశ్రీ తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. ఈ ప్రణాళికలు గ్రామ, మండల, పట్టణ స్థాయి నుంచి జిల్లా వరకు రూపొందిస్తారని ఆమె వివరించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలు తెలియజేశారు.

అభివృద్ధి ప్రణాళికలు అంటే ఏమిటీ?

వివిధ రంగాల్లో రాష్ట్ర పురోభివృద్ధికి 15శాతం వృద్ధి రేటు సాధించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపిడివో), మునిసిపల్ కమిషనర్లపై బాధ్యత ఉంచారు. వీరు గ్రామ, పట్టణ, మండల స్థాయిలో వివిధ అంశాలల్లో వృద్ధి రేటు పెంచేందుకు వీలుగా కార్యచరణ ప్రణా ళికలు రూపొందించాలి. వీటిన్నింటిని క్రోడికరించి జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ ఆధ్వ ర్యంలో కార్యచరణ ప్రణాళికలు రూపొం దిస్తారు. రాబోయే ఐదేళ్లకు అన్నిశాఖల నుంచి ముఖ్యమైన అంశాలు ఈ ప్రణాళికలలో ఉండాలి. జిల్లా అధికారులు పట్టణ, మండల, గ్రామ స్థాయి అధికారులను ఎప్పటికిప్పుడు మార్గనిర్దేశ్యం చేస్తుంటారు. ఈ ప్రణాళికలు రూపకల్పనలో జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ నోడల్ అధికారిగా వ్యవహరిస్తుంది. ఇతర శాఖల జిల్లా అధికారులు ప్రణాళిక శాఖ అధికారులకు సహకరిస్తారు. ఈ ప్రణాళికల రూపకల్పనపై మానిటరింగ్ చేయడానికి జిల్లా అధికారులు మండలాలు, పట్టణాల్లో సెక్టారల్ అధికారులుగా వ్యవ హరిస్తారు.

ప్రణాళికలలో ఏయే అంశాలు ఉంటాయి? ఎవరు రూపొందిస్తారు?

స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంటేషన్ రూపకల్పనకు గ్రామ, వార్డు స్థాయిలో ప్రజల్లో చైతన్యం కల్గించాలి. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రజలను భాగస్వామ్యం చేసి ప్రభుత్వం నుంచి వచ్చే నమూనా దరఖాస్తులను క్యూఆర్ కోడ్ ద్వారా ఒపెన్ చేయించి ఆయా ప్రాంతాల్లో వారికి కావాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, సౌకర్యాలపై పూర్తి చేయించాలి. గ్రామ పంచాయతీ స్థాయిలో స్థానిక అవసరాలు, సమస్యలు, పరిష్కారాలకు సంబంధించి గ్రామ, వార్డు సభల్లో ప్రణాళికలు ప్రజల ద్వారానే తయారు చేయించాలి. ప్రాథమిక విద్య, ఉన్నత విద్యకు సంబంధించి రాబోయే తరాల వారి నుంచి వివరాలు నమోదు చేయాలి. ఇందుకు సంబంధించి విజన్ 2047 డాక్యుమెంట్స్‌పై పాఠశాలల్లో వక్తృత్వ, ఎస్ఏ రైటింగ్ ఇతర నైపుణ్య పోటీలు నిర్వహించాలి. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్స్‌పై విద్యార్థులలో అవగాహన కల్పించి 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అభివృద్ధి క్యాలండర్‌ను రూపొందించేలా చర్చలు జరపాలి. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి మూడు బహుమతులు కూడా ఇవ్వాలి.

డాక్యుమెంటేషన్‌పై కార్యాచరణ ఉందా?

ఈనెల 20 నుంచి 26 వరకు ఇంటింటికి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరుగుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే స్థానిక అవసరాలు, సమస్యలపై ప్రజల నుంచి క్యూ ఆర్ కోడ్ ద్వారా వివరాలు సేకరిస్తున్నాం. ఈనెల 27 నుంచి 29 వరకు పాఠశాలల్లో పోటీలు నిర్వహిస్తారు. 30వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు జిల్లా కలెక్టరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలతో సమావేశాలు నిర్వహిస్తారు. విజన్ డాక్యుమెంటేషన్ 2047పై చర్చిస్తారు. తరువాత రైతులు, వివిధ తరగతులకు చెందిన ప్రతినిధులు, చాంబర్స్, అసోసియేషన్స్‌ల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు.

ప్రణాళికల రూపకల్పనకు తుది గడువు ఎప్పుడు?

మండల స్థాయిలో ప్రణాళికల రూపకల్పనకు ఈనెల 30వ తేదీని చివరి తేదీగా నిర్ణయించారు. జిల్లా స్థాయి ప్రణాళికల రూపకల్పనకు అక్టోబరు 15న తుది గడువుగా నిర్ణయించారు. జిల్లా స్థాయి ప్రణాళికలను మొత్తం క్రోడికరించి స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్ విడుదలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నవంబరు 1న వికసిత్ భారత్ 2047 పేరుతో డాక్యుమెంటేషన్‌ను విడుదల చేస్తుంది.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్యార్థుల పాలిట కల్పవృక్షం కౌండిన్య ఐఎఎస్ అకాడమీ

అకాడమీ విద్యార్థులతో కెఎస్ లక్ష్మణరావు, లక్ష్మణరెడ్డి తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు :అతి తక్కువ ఫీజులతో, భోజన వసతి కల్పిస్తూ విద్యార్థులకు పోటీ పరీక్షలలో అత్యున్నత శిక్షణ అందిస్తున్న కౌండిన్య ఐఏఎస్ అకాడమీ విద్యార్థులకు కల్పవక్షంగా మారుతుందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. పెదకాకాని మండలం వెనిగండ్ల సమీపంలోని కౌండిన్య ఐఏఎస్ అకాడమీ నిర్వహిస్తున్న మొదటి బ్యాచ్ విద్యార్థుల వీడ్కోలు సభకు కె.యస్.లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కౌండిన్య ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ ఇ.వి. నారాయణ విద్యారంగానికి రోల్ మోడల్ అని కొనియాడారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్, ఎల్ఐసి, బ్యాంక్ రంగాలలో ఉత్తమ శిక్షణ ఇవ్వడంలో కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఆదర్శనీయంగా ఉందన్నారు. విద్యార్థులు నిరంతరం పట్టుదలతో ఇష్టపడి చదివి పోటీ పరీక్షలలో నెగ్గాలని సూచించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఇ.వి నారాయణ 20 సంవత్సరాల క్రితమే కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేసి రూ.2.25 కోట్ల మూలధనాన్ని సమకూర్చి ఇప్పటి వరకు ప్రతిభ గల పేదవిద్యార్థులకు రూ.రెండు కోట్ల ఉపకార వేతనం ఇవ్వటం అభినందనీయమన్నారు. విద్యార్థు లలో నైపుణ్యాలను పెంపొందించడానికి రూ.ఏడు కోట్ల విరాళాలు సేకరించి కౌండిన్య ఐఏఎస్ అకాడమీని గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ట్రస్ట్ వ్యవస్థాప కులు డాక్టర్ ఈవి నారాయణ మాట్లాడుతూ ప్రతిభ గల పేద విద్యార్థులను ఆదుకోవడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. రూ.50 లక్షలతో డాక్టర్ ఈవి నారాయణ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామని, ఈ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు నైపుణ్యాలను అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు రచిం చిన సివిల్ సర్వీసెస్ ప్రాథమిక అంశాలు పుస్తకాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌండిన్య డిన్య ఐఏఎస్ అకాడమీ నేతలు వాకా రామగోపాల్ గౌడ్, చిలక చంద్రమౌళి, బెల్లం కొండ సదాశివ గౌడ్, కంచర్ల యాదాద్రి, పామర్తి సాంబశివ రావు, వీరంగి రంగారావు, వేముల శేషాచలం, డాక్టర్ కృష్ణ, డాక్టర్ సాంబశివరావు, వడ్డంగుంట సుబ్బారావు ప్రసంగించారు.

26 నుండి స్కూల్ గేమ్స్ ఎంపికలు

ప్రజాశక్తి-గుంటూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా 2024-25 సంవత్సరానికి జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు ఈనెల 26వ తేదీన సెపక్‌తక్రా అండర్ 14, అండర్ 17 బాల బాలికల ఎంపికలు సత్తెనపల్లి మండలం, నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు డిఇఒ పి.శైలజ, స్కూల్ గేమ్స్ సెక్రెటరీ మల్లెంపూడి రవి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బాడ్మింటన్ ఎంపికలు శావల్యా పురంలో, 27వ తేదీన బాల బాలికల అథ్లెటిక్స్ ఎంపికలు నంబూరు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తామన్నారు.

నేడు యథావిధిగా కలెక్టర్ గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.